నేడు యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


ముస్తాబైన ఆలయం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రధానార్చక బృందం శనివారం శ్రీకారం చుట్టనున్నది. శనివారం ఉదయం 10గంటలకు వంద మంది రుత్విక్కులు, పారాయణందారులు, వేద పండితులు, పురోహితులు, ఆలయ అధికారులు కలిసి స్వయంభూ పంచనారసింహస్వామి అనుమతి తీసుకుని, ప్రధానాలయ ముఖ మండపంలో విశ్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం వేడుకలతో ప్రారంభించనున్నారు. నేటి నుంచి ఈ నెల 11వరకు సాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలంకరణ, రంగురంగుల పూలతో ఆలయాన్ని సుందరీకరించారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలను స్వామివారికి అందజేసే అవకాశం ఉంది. ఆలయం తరపున అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ ఆలయ ఈఓ, పోచంపల్లి చేనేత సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ప్రస్తుతం రోజూ 500 మందికి అన్నదానం చేస్తుండగా.. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజూ 2వేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండ కింద నిత్యన్నదాన సత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఉంటుందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

యథావిధిగా స్వామివారి దర్శనాలు

వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని స్వామివారి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయిన ఆలయ ఈఓ భాస్కర్ రావు తెలిపారు. బ్రేక్ దర్శనంతోపాటు ధర్మదర్శనాలు, ప్రత్యేక దర్శనాలు ఉంటాయని, నేటి నుంచి 11వరకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, మొక్కు సేవలను రద్దు చేస్తున్నామని అన్నారు. 7నుంచి 9వరకు భక్తులతో జరిపించే అర్చనలు, బోగాలు, 10, 11 తేదీల్లో అభిషేకాలు, అర్చనలు రద్దు చేయనున్నామని చెప్పారు..

బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి వస్త్రాలు

అమ్మవారి కోసం నేసిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలు సిద్ధమయ్యాయి. పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి రెండు పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు, స్వామివారికి పట్టు దోవతులు, వస్త్రాలను తయారు చేయగా వాటిని గుట్ట దేవస్థానం డీఈఓ భాస్కర్‌శర్మ, ఏఈఓ రమేశ్‌బాబు, జె.కృష్ణ, సూపరింటెండెంట్ డి.నరేశ్ పరిశీలించారు. కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షులు బోగ నర్సింహ, అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారత బాల రత్నం, ప్రతినిధులు పాల్గొన్నారు.

గుట్టలో ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఆరు రోజులపాటు ఉత్సవాలను స్మార్తాగమశాస్త్రం ప్రకారం పాంచాహ్నికదీక్షతో కొండపైన గల ప్రధానాలయంలోని యాగశాలలో నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం ఉదయం వివిధ పారాయణాలు గావించారు. అనంతరం పూర్ణాహుతి త్రిశూలతీర్థ కార్యక్రమాలను యజ్ఞబ్రహ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పారాయణాల అనంతరం శివపార్వతుల శృంగార డోలోత్సవ వేడుకలు నిర్వహించి ఉత్సవాల పరిసమాప్తి గావించారు.

కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, శివాలయ ప్రధానార్చకుడు నరసింహరాములు శర్మ, ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం ఆలయ ఆవరణలో ఉన్న శ్రీవారి మంటపంలో స్వామిని స్వర్ణకవచంతో అలంకరించి కొలువుదీర్చారు. స్వామివారికి ద్వాదశారాధనం చేశారు. పుష్పయాగం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. ధ్వజారోహణం దేవతా ఉద్వాసనతో బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. అంతకుముందు అవభృథ స్నానం, తీర్థ చక్రస్నానం కార్యక్రమాలు జరిగాయి. స్వామివారికి 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వేద పుష్కరిణిలో పుణ్యాహవచనం చేసి చక్రస్నానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు దంపతులు, మురళీకృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య

మహాసభలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : రైతులు పండించిన వరి ధాన్యంతోపాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం మండల 6వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రైతుభరోసా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బుచ్చిరెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకటేశ్, లింగారెడ్డి, సత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలి

- కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్‌లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్, ఫిబ్రవరి 28 : మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా 16, 20వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా విషయంపై ఆరా తీశారు. వారానికోసారి నీటి సరఫరా జరుగుతుందని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావులు ఒట్టిపోయాయని మున్సిపల్ కమిషనర్ వివరించారు. మిషన్ భగీరథ నీటిని, అక్కడక్కడ బోరుబావుల ద్వారా వచ్చే నీటిని కలిపి సరఫరా చేస్తున్నామని చెప్పారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ నీటిని వేడి చేసి తాగాలని, ఆర్వో ప్లాంటు నీళ్లు తాగితే ఆరోగ్య సమస్యలు వస్తాయని ప్రజలకు సూచించారు. మిషన్ భగరీథ నీళ్లు ఇచ్చే ముందు ప్రజలకు ఆటోలో మైక్ ద్వారా తెలుపాలన్నారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వంద పడకల దవాఖానను సందర్శించారు. పనులు వేగవంతం చేసి వైద్య సేవలు త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. సామాజిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. సాధారణ ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండడంతో వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలకు కనీసం వంద డెలివరీలు చేయాలని వైద్యులకు సూచించారు. ఈ నెల 20 డెలివరీలు చేయడంపై మండిపడ్డారు. ఇక్కడ మత్తు డాక్టర్ ఒక్కరే ఉండటంతో డెలివరీలు చేయడం ఇబ్బందిగా ఉన్నదని వైద్యులు తెలిపారు. కలెక్టర్ వెంటనే డీసీహెచ్‌తో మాట్లాడి కాంట్రాక్ట్ పద్ధతిలో మత్తు డాక్టర్‌ను నియామించాలని ఆదేశాలు జారీ చేశారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్లు, సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. దవాఖాన వద్ద ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేసి ప్రతి సోమవారం సమీక్ష చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, తాసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మండల వైద్యాధికారి చింతకింది కాటంరాజు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో ఆకస్మిక తనిఖీ

ఆలేరు టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ సైన్స్ డేలో భాగంగా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో కొత్త మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిలో కూరగాయలు, ఆకుకూరలు చూసి తాజాగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఆయన వెంట ఎన్‌సీసీ అధికారి దూడ వెంకటేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

- సీఎంకు సీపీఎం బహిరంగ లేఖ


సీఎం రేవంత్‌రెడ్డికి పంపుతున్న బహిరంగ లేఖను ప్రదర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28 : జిల్లా వ్యాప్తంగా నీళ్లు లేక ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి పంపించే బహిరంగ లేఖను సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటడంతో జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 3వేల ఎకరాలకు పైగా పంటలు ఇప్పటికే ఎండిపోయాయన్నారు. మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సాగు కోసం రైతులు ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేశారని, పెట్టుబడి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు. వెంటనే వ్యవసాయ అధికారుల ద్వారా నివేదికలు తెప్పించుకుని కనీసం ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని లేఖలో కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

భూదాన్ పోచంపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల స్థాయి అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని వారు రుచి చూశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడు

భువనగిరి అర్బన్ : ఓ యువకుడు పట్టణంలో తప్పిపోయాడు. ఏపీలోని ఏలూరు జిల్లా కదిరి మండలం ములంక గ్రామానికి చెందిన జుత్తుగ శ్రీను భువనగిరిలో తన సోదరుడు సత్తిబాబుతో కలిసి ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సత్తిబాబుతో కలిసి భువనగిరి బస్టాండ్‌కు వచ్చిన శ్రీను.. అతన్ని అక్కడే కూర్చోమని చెప్పి వెళ్లిపోయాడు. శ్రీను ఎంతకూ రాకపోవడంతో సత్తిబాబు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శ్రీనుకు 39 ఏండ్లు ఉంటాయని, ఎత్తు 5.9, బ్లాక్, రెడ్ కలర్ షర్ట్, బ్రౌన్ కలర్ జీన్ పాయింట్ ధరించాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసులకు తెలియజేయాలని భువనగిరి ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పరామర్శ

లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 : పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గౌటి సదానందం భార్య లక్ష్మి ఇటీవల మృతిచెందారు. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పాండవుల భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

'సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలి'

పిల్లాయిపల్లిలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. పిల్లాయిపల్లి గ్రామంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీరు, ప్రాజెక్టులు, కాల్వలు, మూసీ జల కాలుష్యం, బీబీనగర్‌లో ఎయిమ్స్ హాస్పిటల్‌తో పాటు ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలో డిగ్రీ, పిజీ, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గూడూరు అంజిరెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, పత్తి భిక్షపతి, అందెల జ్యోతి, లావణ్య, గంగారెడ్డి, మల్లారెడ్డి, అశోక్, భిక్షపతి, నర్సింహ, అశోక్, రంగయ్య, యాదయ్య, భూపాల్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

కేకేతండాలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 28 : గ్రామీణ ప్రాంతంలోని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండలంలోని కాండ్లకుంట తండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అధ్యాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేసేలా ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్టల శంకర్, నాయకులు లావుడ్య బుజ్జి, రాజప్ప, మల్లేశ్, తుమ్మల జయమ్మ, సాయిలు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎండిన పంటల పరిశీలన

పాలడుగులో ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 28 : మండలంలోని పాలడుగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగు నీరందక ఎండిన వరి పొలాలను సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు మాట్లాడుతూ రైతులు ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టి వరి పంటలు సాగు చేస్తే నీళ్లందక ఎండిపోయాయన్నారు. వ్యవసాయ అధికారులు ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు. ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడిపల్లి ప్రభాకర్, పిట్టల చంద్రయ్య, కొంపెల్లి గంగయ్య, వెండి యాదగిరి, సోమరాజు, లక్ష్మణ్, రాజమల్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి శిలిష

రామన్నపేట, ఫిబ్రవరి 28 : మార్చి 8న కోర్టు ఆవరణలో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష అన్నారు. మండల కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోగా అదాలత్‌లో ఇరువర్గాలు రాజీ పడే కేసులను పరిష్కరించే దిశగా పోలీసులు, ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నించాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు మల్లయ్య, యుగేందర్, నాగరాజు, ప్యానల్ న్యాయవాదులు మామిడి వెంకట్‌రెడ్డి, దంతూరి సత్తయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నోముల స్వామి పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ కృష్ణారెడ్డి

సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 28 : ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని భువనగిరి ఆర్డీఓ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో భూమి రికార్డుల నిర్వహణ, పట్టాదారు రైతుల దస్త్రాలను పరిశీలించారు. సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ షాపులకు సరఫరా చేసే బియ్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ఇన్‌చార్జి లియాఖత్ అలీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గోదాములో చాలా రోజులుగా పేరుకుపోయిన నిల్వలను పరిశీలించి విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యలపై జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల పనితీరుపై రోజు వారీగా పర్యవేక్షణ చేసి పని బాధ్యతలను అప్పగించాలని తాసీల్దార్ రాంప్రసాద్‌ను ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈఓ సత్యనారాయణ

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న డీఈఓ సత్యనారాయణ

వలిగొండ, ఫిబ్రవరి 28 : విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సైన్స్ ఫెస్టివల్‌ను ప్రారంభించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రేణుకాకుమారి, జనార్దన్‌రెడ్డి, స్వర్ణలత, వెంకట్‌రెడ్డి, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలి : ఎంపీడీఓ

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి

తుర్కపల్లి, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని మండల ప్రత్యేక పరిశీలన అధికారి, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనంలో శుచి, శుభ్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై శుక్రవారం ప్రజలకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లోని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి అలవాట్లను అలవరుచుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, శ్రీశైలం, సిద్దిరాములు, కృష్ణారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు

మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మోటకొండూర్, ఫిబ్రవరి 28 : మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మండల వైద్యాధికారి విజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఇందిర, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్, మండల వైద్య సిబ్బంది శివాని, హారిక, పార్వతమ్మ, నర్సయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాముకుంటలో రూ.2.50లక్షలకు బెల్టు షాపు వేలం

రాజాపేట, ఫిబ్రవరి 28 : మండలంలోని పాముకుంట గ్రామంలో మార్చి నెలలో దుర్గమ్మ, బొడ్రాయి పండుగలు నిర్వహించనున్నారు. పండుగ కోసం గ్రామంలో ఒక్కరే మద్యం విక్రయించాలని వారం రోజుల క్రితం గ్రామస్తులు కలిసి బెల్టు షాపు నిర్వహణకు వేలం పాట నిర్వహించినట్లు శుక్రవారం తెలిసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.2.50 లక్షలకు దక్కించుకున్నాడు.

బెల్టు షాపు దక్కించుకున్న వ్యక్తి రెండు సంవత్సరాల పాటు ఒక్కడే మద్యం అమ్ముకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

గ్రామంలో మరెవరైనా మద్యం విక్రయిస్తే పోలీసులకు చెప్పి కేసు నమోదు చేయిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారని బెల్టు షాపుల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE: AT BHONGIR.
I.A.NO OF 2024
IN
O.S.NO. 69 OF 2018
BETWEEN:
Boju Sadanand and another
...Petitioners/Plaintiffs
AND
Gokari Veera Arjun Goud and others.
...Defendants.
To